# చుక్కల వరాలు

పచ్చల కండిగ గ్రామం చుక్కల వరహాలంటే చాలు. ఆ పరిసరాల జనపదాల కంతా అత్యంత స్పష్టంగా తెలుసు. అరచేతి వెడల్పు పట్టా అంచులున్న నారాయణ వనం చేనేత పంచకట్టుతో మోకాటిదాకా కనిపించే మల్లెపువ్వులాంటి తెల్లని మల్లు జుబ్బా తొడుక్కొని కంచి సరిగంచు పై కండువాతో సాక్షాత్కరించే ఆ పల్లెటూరి మోతుబరి రైతు ఎడమచేతి నిండుకూ కవిలి కలిజ వేదాకులుంటాయి. పొద్దస్తమానం తమలపాకుల్ని నమలుతూ ఎప్పుడో ఒకసారి వ్రేలెడంత సన్నని పొగ చుట్టను పీలుస్తూ అగపడిన ప్రతివారినీ ఆదరంతో పలకరిస్తూ అనుక్షణం హాస్యోక్తులతో నవ్వులను చిందిస్తూ బహుజన ప్రియుడని పించుకొన్న వరహాలు అర్ధాంగి ఆ పల్లెలోని కూలీలు నోచుకొన్న వరాల కాసుల పేరు ముత్యాలు. చుక్కల వరహాలన్నా ముత్యాలన్నా ఆ ఊళ్లో అందరికీ రెండు కళ్ళ వంటివారు.

పచ్చల కండిగ చిన్న పల్లెటూరైనా ఆ ఊరికి ఉందొక పోస్టాఫీసు. పశువుల ఆసుపత్రి ఎంత చిన్నదైనా బాగా పని చేస్తున్నట్లు ప్రతీతి. ఒక ప్రసూతి కేంద్రం, ప్రాథమిక పాఠశాల. ఇవన్నీ కూడా వరహాలు కాలికి బలపం కట్టుకొని తిరిగి తిరిగీ సాధించిన వరాలు. ఏ రాజకీయ పార్టీ నాయకుడికైనా వరహాలంటే ఎంత ఆత్మీయతో చెప్పలేము. కుట్రలూ కుతంత్రాలు మరే అన్నెం పున్నెం యెరుగని అమాయకుడు వరహాలు. తాలూకా ఆఫీసు నుండి పంచాయతీ సమితి కార్యాలయం వరకు వరహాలు అడుగు పెడితే అప్పటికప్పుడే పూర్తి కాని పని అంటూ ఏదీ లేదు.

పచ్చల కండిగకు ఏ అధికారి వచ్చినా వరహాలింటిలో కాఫీ పుచ్చుకోకుండా, గ్లాసెడు మజ్జిగనైనా తీసుకోకుండా వెళ్ళిన రోజంటూ చరిత్రలోనే లేదు. వరహాలు కోటీశ్వరుడు కాకపోయినా 'పెరటి తంగెటి జున్ను' అని అన్పించుకొన్న దానకర్ణుడు.

ఆ ఊళ్ళో ఏ కూలివాడు పస్తున్నా వరహాలు నిద్రపోలేడు. పుట్టుకతోనే

వచ్చిన స్వభావమది, ఇల్లాలు ముత్యాలు ఈసడించుకొంటున్నా గాదెలోకి పాలేరును దింపి గంపలకెత్తి తలో చేటెడు ధాన్యాన్ని పంపేవాడు. కల్లంలో కొంగు పరచిన వారికంతా ఈత మెలికల బుట్టలతో ఎత్తిపోసేవాడు. చేత పైసా లేక పోయినా ఏ బ్యాంకులోనైనా ఇల్లాలి బొందుచైనైనా సరే తాకట్టు పెట్టి పదికాసులు తెచ్చి మాలామడీ అవసరాల కిచ్చి ఆదుకొనే అప్పటమైన బంగారం ఆ వరహాలు.

ఆ పల్లెలో వరహాల మాటకు అడ్డు చెప్పేవారు దివిటీపట్టి గాలించినా లేరు. ఏ సమావేశం జరగాలన్నా వరహాలు చెప్పిందే తీరు. ఏ ఉత్సవాన్ని నిర్వహించాలన్నా అతడు కట్టిందే తేరు. ఏ వ్యవహారాన్ని పరిష్కరించాలన్నా అతనికి పెట్టింది పేరు.

గత రాయలసీమ కరువు నుండి ఆ గ్రామీణులకు అతడంటే యేర్పడి పోయింది. అమితమైన విశ్వాసం. అందుకు కారణం ఆ కాటకంలో అతడెంతో వ్యయ ప్రయాసలతో ఆబాలగోపాలం మెచ్చుకొనే విధంగా నడిపించిన గంజి కేంద్రం. గురివెందంత బంగారాన్ని కూడా ఉంచకుండా ఇంట్లో ఆడపడుచుల నగలన్నిటిని ఒలిచి మూడు రూపాయల వడ్డీకి కుదువబెట్టి వాగెన్ల గడ్డిని తెప్పించి గొడ్డూ గోదను బతికించి నోరులేని జీవాలను కసాయివారి కప్పగించకుండా కాపాడిన ఉదంతాన్ని యింతలోనే ఎలా మఱువగలదా జనపదం? అదే నేటి జానపద వాఙ్మయంలో కాసంత చోటు చేసుకొని ఆ నోటా యీనోటా విన్పిస్తున్న కమ్మని గానం.

వరహాలు పొలంలో రత్నాలు పండకపోయినా రాలుతుంది గుంటకు పుట్టెడు తక్కువ కాకుండా ధాన్యం. మెట్టచేలలో ఆరికలు, కొర్రలు, సజ్జలు, సామాలు, జొన్నలతో పాటు మానావరిగా పండుతుంది పెసర, అనుము, మినుము, ఉలవ, అలసంద, కందివంటి కాయధాన్యం. సొర, కరిబూజ, దోస, గుమ్మడి, రామ గుమ్మడి, బూడిద గుమ్మడి బండ్లకెత్తడం అడపాదడపా తప్పని కార్యక్రమం.

అతడు చొక్కం రైతు బిడ్డ కావడం వల్లా ఆకు తోటను తడియార నివ్వడు. అరటితోటకు నీళ్లు పెట్టకుండా ఉండడు. సంత నాటికి మోపెడు అరటాకులను తట్టెడు తమలపాకులను పేటకు పంపకుండాను ఉండడు. కనుకనే ఎంత కాటకం వచ్చినా ఆవుల్ని గేదెల్ని అమ్ముకోకుండా నిక్షేపంలా బ్రతుకుతూ వచ్చాడు.

ప్రతి సేద్యంలోనూ ఎక్కువ శ్రద్ధ పుచ్చుకోవడం వల్లా వరహాలుకు ఏదో ఒక పంట చేతికి చిక్కింది. అది కొంత ఆదాయాన్ని యిస్తూ వచ్చింది.

స్థితిపరుడు కాకున్నా స్థిమిత పరుడనిపించుకొన్నాడు. ధర్మరాజు కాలేక పోయినా పచ్చుల కండిగలో ఒక ధర్మరాజు దేవాలయాన్ని కట్టించి మహాభారతాన్ని జరిపిస్తూ అగ్గారికి పచ్చులు వేయిస్తూ చిన్నా పెద్దకు కన్నులో పాపలా కనిపిస్తున్నాడు.

అసలు వరహాలే అనుకొని వుంటే ఎప్పుడో కోటికి పడగెత్తి కుబేరుడై ఊరేగే వాడు. అందుకు తగ్గ అవకాశాలు ఆయనకున్నవి బోలెడు. అయినా వరహాలు కొన్ని ధర్మాలను పాటిస్తూ వచ్చాడు. కాంట్రాక్టుల జోలికేమాత్రం పోడు. ఎంత పెద్ద ఎలెక్షన్ వచ్చినా కమిషన్ వ్యాపారం చెయ్యడు. భూదేవినే నమ్ముకొన్న బి.సి. కాలం నాటి అమాయకుడైన కర్షకుడు.

రాయలసీమలో ఏటా కరువనే విషయం ఎవ్వరూ కాదనలేని నిరూపించ రాని జగమెరిగిన సత్యం. పుష్కరాని కొకమారు కోటి పడగల భుజంగం వలె అది విజృంభిస్తుంది. ఆ ప్రళయ కాలం సమీపించడంతో అది విలయ తాండవం చేసింది. వికటాట్ట హాస ఘోషలతో విరుచుకపడింది. దావానలమై పచ్చపచ్చని ఇక్షు క్షేత్రాలను దహించి వేసింది. భయంకర కరాళ నృత్యంతో పాతాళాన్నంటిన బావుల్లోకి నాల్కలను సాచి మంచినీటి చుక్కనైనా మిగల్చకుండా పీల్చివేసింది. దాహంతో అల్లల్లాడే పసిబిడ్డలను కూడా నిర్దాక్షిణ్యంగా మాడ్చివేసింది. వేలాది ఎకరాల పండ్లతోటలను కాల్చివేసింది. పేదాబిక్కీ జీవితాల నంతా నిలువునా కూల్చివేసింది.

అతి భీషణమైన కరువులో పచ్చులకండిగ హరిజనవాడకు సంక్రమించిన గతి పరిగిలి పోయే స్థితి. భూమీ పుట్రా వదలివెళ్లలేక దుర్భరమై పోయిన లేమిని భరించలేక ఏకోనలోనూ ఈతగడ్డలైనా లభించే దిక్కు తోచక, ముళ్లతో గుచ్చి గుచ్చీ ఏరి తెచ్చుకొందామన్నా ఎండి రాలిపోయిన దేవదారాకులైనా కనిపించక పళ్లు కరచి పట్టుకొన్నా పైపై కెగిరిపోయే ప్రాణాలను నిలుపుకోలేక హృదయ విదారకమైన పరిస్థితిని ప్రస్ఫుటిస్తున్నది రైతుల ప్రకృతి.

చుక్కల వరహాలు ఆలోచించాడు. తనలో తానే ఒక నిర్ణయానికి వచ్చి వేశాడు. ఐదు గుఱ్ఱాల పవరున్న మోటారును బండికెత్తించాడు. ఆనాడే అడిగి నంతకే అమ్మి వేశాడు. ఆ రొఖ్ఖంతో కొన్న నూకల్ని తలో శేరెడిచ్చినా ఒక్క పూటకైనా అందక పోవడంతో దిగాలు పడి కూచున్నాడు. అతని కప్పుడు తోచింది మెరుపులాంటి మరో ఆలోచన. అతడా ఊరి సొసైటీకి అధ్యక్షుడు. ఎంత ఎక్కువ మొత్తాన్ని తెచ్చుకోవచ్చో క్షణాలలో లెక్క వేశాడు. లక్ష పై చిలుకు అప్పు తెచ్చే

అవకాశం కనిపించడంతో తటపటాయించుకొని పైకి లేచాడు. దరఖాస్తులూ దస్తావేజులు వ్రాయించి వ్రాతకోతల్ని పూర్తి చేయించి లక్ష రూపాయల పచ్చ నోట్లను ఊళ్లోకి తెచ్చి యింటింటికీ సారె పంచినట్లే పంచేశాడు.

ఆ కరువులో చేతికి చిక్కిందే చాలుననుకొని తలో వెయ్యిరూపాయలు తీసుకొని కలో గంజో కాసుకొని నెమ్మదిగా కూచున్నారు పచ్చల కండిగ రైతులు కూలీలు.

వరహాలొక సొసైటీలోనే కాదు ప్రభుత్వం నుండి దొరికే ప్రతి అప్పునూ తెచ్చి తన పల్లె ప్రజల్ని ఎల్లదాట నివ్వకుండా ఉంచుకొన్నాడు. ఆ పరిసరాల జన పదాల నుండి ఎందరో వలసలు వెళ్ళినా పచ్చలకండిగ గ్రామస్థులు మాత్రం కాళ్ళూనుకొని నిలబడగలిగారు.

పిల్లా జెల్లా నుండీ ముసలీ ముతకా వరకూ వరహాలంటే, దేవుడిచ్చిన వరాల మూటనే భావించారు.

వరహాలు మామూలుగానే ఉన్నాడు. భూగోళాన్నే మింగేసేటంతటి కాటకం వచ్చినా అతని ముఖంలో వెలుగు తగ్గలేదు. ఎప్పుడూ నవ్వుతూ పలకరించే ధోరణినీ వదలలేదు. చీనీకాయ సైజు నిమ్మపండు నెత్తి పెట్టినా జారిపోని పసందైన కుచ్చు మీసలకట్టు, పసుపుపచ్చని వెడల్పాటి పచ్చంచు నారాయణరం చేనేత పంచకట్టు. నిడుపాటి వెన్నెల వాగులాంటి జుబ్బాపై గట్టులపై కెక్కి తొంగి చూచే కెరటం వంటి కంచి సరిగంచు పల్లెవాటుతో కోటి రైతుల పెట్టుగా హుందాగా సాక్షాత్కరిస్తున్నాడు చుక్కల వరహాలు.

ఉక్కు గుండెల మొక్కవోని ధైర్యానికి నిదర్శనం చుక్కల వరహాలు. ఊళ్ళో త్రాగడానికి నీళ్లు లేకుంటే తన కపిల బావి నుండి తెచ్చుకోమన్నాడు. తాను ప్రాణప్రదంగా పెంచుకొంటూ వచ్చిన ఆకుతోట అడుగంటి మాడిపోయినా, ఆకాశంలో ఆరవేసిన అంగవస్త్రాలను జ్ఞప్తికి తెచ్చే అరటితోట నిలువునా వాడిపోయినా చూస్తూ చూస్తూ ఆ బావి నీటినంతా ఆబాల గోపాలానికి త్రాగు నీరుగా అప్పగించాడు. ఆ నీళ్ళు కూడా అందడం లేదని తెలిసి కట్టలు కట్టలుగా కరెంటు తోటాలను తెప్పించి కసికీ మెసకని పాషాణాన్ని పగుల గొట్టించి పదో మట్టు నుండి పద్నాలుగు మట్లు దాకా లోడించి పాతాళానికి వెడుతున్న నీటిని పైకి తెచ్చాడు. ఆ ఊళ్లో పద్నాలుగు మట్లు తెగిన బావి అదొక్కటే. ఆ క్రింద వేసిన బోరింగు ఎన్ని అడుగులో లెక్కలేదు. ఆ ఒక్క పనికే పదివేలై ఉంటుందని

ఆ నోటా ఈనోటా అనుకొంటున్నా వరహాలు వినీ విననట్టే ఊరుకొన్నాడు. పది మంది కోసం చేసిందెప్పుడూ బహిరంగంగా చెప్పుకునే అవధానం అతనికిరాదు.

ఒకనాటి మిట్ట మధ్యాహ్నం కణకణలాడే ఎండలో ఆవురావురుమని ఒక జీపుకారు వచ్చి వరహాలు ఇంటిముందు ఆగింది.

వరహాలు పేటలో ఉన్నందున ఆ వచ్చిన వారిని పరామర్శించే మగవారా సమయంలో యింట్లో లేరు. పాలేరు పశుల కొట్టంలో పడి నిద్రపోతున్నాడు. వరహాలింట్లో పొయ్యిని రోజూ ముట్టించే అలవాటు మాత్రం లేదు. ఎంత. కరువులోనైనా అది అక్షయంగానే మండుతూనే ఉంటుంది. దేవరింటిలో దీపం కూడా అహర్నిశలూ వెలుగుతూనే ఉంటుంది.

ముత్యాలప్పుడే ఎసట్లో పిండి పోసింది. ఆ కుత కుత లాడుతున్న సవ్వడిలో ఇంటి ముంగిట ఆగిన జీపు అలికిడి ఆమెకే మాత్రం వినిపించలేదు. ఎంతటి కుబేరుడైనా కొండంత రెడ్డైనా మధ్యాహ్నం సంగటినే తినాలని వరహాలు వాదం. ఆ రైతు వేదంలో యింకా ఎన్నో రహస్యాలున్నవి. పరగడపున చెంచెడు కూటి నీళ్ళు త్రాగి కానీ వరహాలు కడప దాటడు.

ముత్యాలు తమర కట్టెను బానకానించి సంగటి కట్టెను పెట్టి కెలుకుతున్న తరుణంలో బూట్ల శబ్దం వినిపించి వెనుదిరిగి చూచింది. వారు మరీ దగ్గరగా సమీపించే లోగా చెమట్లు తుడుచుకొంటూ పైకి లేచింది. ఆ వచ్చిన అధికారి మరో యిద్దరు బంట్రోతులతో ఆ సంగటి భానవెత్తి నడివీధిలో పెట్టారు.

గౌరవప్రదంగా జీవించే కర్షకుని జీవిత చరిత్రలో ఈ సంఘటన సామాన్య మైనది కాదు. ఇంతకంటే ఆ రైతును తల కొట్టెయ్యవచ్చు. బహిరంగంగా ఉరి తీసెయ్యవచ్చు. నిలువెత్తు గొయ్యి తీసి బస్తా ఉప్పు పోసి ప్రాణాలతోనే పాతెయ్య వచ్చు.

ముత్యాలు దండతాడిత భుజంగమై విజృంభించింది. ఉక్రోషంతో అడ్డు తగిలినా ఆమెను నిర్లక్ష్యంగా మూలకు నెట్టి వేశారు. ఊరేగే చిరుతానూరు తేరు కుప్పగా కూలిపోయినట్లామె ఆ వైపరీత్యాన్ని చూడలేక కనులు మూసుకొని నేలవాలినది. పాలూ కూడూ తిన్న పెద్ద మనుష్యులు పదిమందీ పోగై నివారించే లోగా చేతికందిన పాత్రలనంతా జీపులో ఉంచుకొని యమకింకరుల్లాంటి అధికారులు వెళ్ళిపోయారు. పచ్చలకండిగ చరిత్రలో ఊళ్ళో జప్తు జరగడం అదే మొదలు.

మిన్ను విరిగి మీద పడింది. భూమి క్రుంగిపోయింది. పచ్చల కండిగ గ్రామ దేవత విరూపాక్షి ముఖం కందిపోయింది. పల్లె పల్లె పట్టరాని ఆవేశంతో అట్టుడికి నట్టుడికి పోయింది. ఆయవమానం మరెంతటి విపరీతానికి దారి తీస్తుందో అనూహ్యమై పోయింది.

కరువులో రేచుకుక్కల్లా కర్షకుల వెంటబడి వేటాడుతున్న సొసైటీల పరిపాలకులు లోనుల ఇన్‌స్పెక్టర్లు పచ్చల కండిగ వైపు జీపును మళ్లించారనే పిడుగులాంటి కబురు చుక్కల వరహాలుకు పేటలో తెలిసీ కదలలేక శిలా ప్రతిమలా కూచున్నాడు. గంట గడిచిందే జరిగిన కథ నంతా విని పైకి లేవలేక పళ్ళు కరచుకొని ఆ మంచంమీదే ఒరిగి పోయాడు.

వరహాలు ఆ సాయంకాలం పొద్దుపోతుండగా సంద చీకటిలో వేటగాడి తుపాకి తూటా గుండె ప్రక్కనే దూసుకపోయిన బెబ్బులి వలె రోజుకొంటూ రొప్పుకుంటూ పచ్చులకండిగలో ప్రవేశించాడు. ఇంటిలో అడుగు పెట్టగానే ముత్యాలు చెక్కిళ్ళపై ముత్యాలవలె తోరణాలు కట్టిన కన్నీటి జాలును తుడుచుకొంటూ పట్టరాని దుఃఖాన్ని మ్రింగుతూ, దిగమ్రింగుతూ జరిగిన పరాభవాన్ని చెప్పివేసింది. ఆ విషాద వృత్తాంతం రైతు భారతంలో దుశ్శాసనుని పైశాచిక ఘట్టం.

వరహాలామెను సముదాయించకనే గబగబా పైకి లేచి పెరటి కొట్టం లోనికి వెళ్లాడు. గోపురాలంత మూపురాలతో కరువులో కూడా బరువు తగ్గని మైలవన్నె కోడెలు మసక చీకట్లో వరహాలు వస్తున్న సవ్వడిని పసికట్టి పైకిలేచి నిలబడినవి. వరహాలు రెండు చేతులా వాటి గంగడోళ్లను దువ్వుతూ మెల్లగా తట్టి ఉన్నట్టుండి దేవరింటికి వచ్చి క్షణం నిలుచున్నాడు. అతని ధీధితులీనే నేత్రాలెందుకో నీటి బుగ్గలైపోయినవి. తక్షణమే ముంగిట్లోకి వచ్చి ఎవరినీ పలుకరించకుండా వెళ్ళిపోయాడు.

మూడు రోజులు గడిచినా వరహాలు జాడ కనిపించలేదు. ఎక్కడా ఉన్న ఆచూకీ పొడకట్టలేదు. వరహాలు ఏ ఊరికైనా వెళ్లి ఉంటాడని ఆ ఋణాలు తీరడానికి డబ్బు తెచ్చే వరకూ తిరిగి రాడనీ అనుకొన్నారు. కానీ అతడు తలెత్తుకొని తిరగడానికి వీలు లేనంత పరాభవంతో క్రుంగి పోయాడని ఎవరూ భావించలేదు. అతని ఆస్తిలో పదోవంతు అమ్మినా అప్పుల వాళ్లకై మిగిలి పోతుందన్న సత్యాన్ని తెలిసిన వారు మాత్రం ఈ పరాభవాగ్నితో దహించుక

పోయి ఏ అగడానికి దిగుతాడోనని- భయపడ్డారు.

ఆ నాలుగోనాడే తెలిసి పోయింది. చుక్కల వరహాలు చుక్కల్లో చుక్కై పోయాడనే వార్త. కోటి పిడుగులు గురి పెట్టుకొని పచ్చల కండిగపై ఒక్కసారిగా పడ్డట్లు అందరి గుండెలూ భగ్గు భగ్గున మండిపోయినవి. పచ్చల కండిగ జనపదం పండు ముత్తైదువ ముత్యాలు ముఖం చూడలేక ఆ గంపెడు బిడ్డల తల్లిని పరామర్శించే మార్గమేదీ తోచక దిక్కులు పిక్కటిల్లేటట్లు రోదిస్తూ సింగన కోనవైపు పరుగులు తీసింది.

హతాశులై పోయి శరవేగంతో దూసుకపోతున్న ఆ జనప్రవాహం కన్నీటిలో ఆబండి జడుము తడిసిపోయింది. ఆ కానలోని బండలే ద్రవించినవి.

అరగడియకే చావుపరుగులతో వచ్చిన ఆ జనసందోహం సింగనకోనలో శృంగాటకాన్ని చేరుకొన్నది.

అక్కడ. ఆ నిర్జన సీమలో ఆకులు రాలిన రావిమావి ఛాయలో కంచి సరిగించు పై పంచను బాగా నేలమీద పరచుకొని దీర్ఘనిద్రలో శయనించి ఉన్నాడు. ఆజానుబాహుడు బంగారు రైతు చుక్కల వరహాలు.

ఆ భూదేవి అనుంగుబిడ్డ అమరజీవి వరహాలు భౌతిక కాయానికి కుడి ప్రక్క జానెడు దూరంలో నున్న ఒకతెలుగు దినపత్రికపై అరకట్ట కలిజ వేడాకులు పిడికెడన్ని వక్కలు వ్రేలెడంత పొగచుట్ట చిన్న కాళీ అగ్గిపెట్టె ఉన్నాయి.

పచ్చల కండిగ ముద్దుల వరాలు చుక్కల వరహాలు పావన కాయానికి ఎడమవైపు అరేబియన్ నైట్స్ కథల్లో వలె కన్పించే చిన్న ఎండ్రిన్ డబ్బాలో విశ్వవ్యాప్తంగా వికటాట్ట హాస ఘోషలు పెడుతున్న మృత్యుదేవత అతి సూక్ష్మ రూపంలో సాక్షాత్కరిస్తున్నది.